# ఇద్దరు ఒకటై

ప్రొఫెసర్ రామారావు డాక్టర్‌గా ప్రభుత్వోద్యోగం నుంచి రిటైరయ్యాడు. నిజానికి అంతకుముందు నుంచే ఎన్నో అవకాశాలు సిద్ధంగా వున్నాయి. రామారావుకి. కొత్తగా పెట్టిన వైద్య కళాశాలల్లో దేంట్లోనైనా చేరేందుకు అతను ఎంతో ఉత్సాహంగా వున్నాడు. డాక్టర్‌గా చాలా ప్రసిద్ధి చెందిన రామారావు స్నేహపాత్రుడు.

"మీరు రిటైరైతే మాకేం తోచదు సార్" అని ఎవరన్నా అంటే "నేను రిటైర్ కాను అయినా మనసుకి రిటైర్‌మెంట్ లేదు. నేను ఎప్పుడూ యంగ్" అని నవ్వేస్తాడు రామారావు.

నిగనిగలాడే జుట్టు, అంతకన్నా నిగనిగలాడే బూట్లు, మడత నలగని డ్రెస్సు, ఎప్పుడూ చెరగని చిరునవ్వు...అదీ రామారావంటే.

చాలా సంతోషంగా ఇంట్లోకి అడుగుపెట్టిన డాక్టర్ రామారావు "రాణీ...రాణీ" అంటూ ఈలపాటతో లోపలకొచ్చాడు. ఎర్రటి లిప్‌స్టిక్, స్లీవ్‌లెస్ జాకెట్టు, పొట్టి జుట్టు, చాలా ఫాషన్‌బుల్‌గా డ్రెస్ చేసుకుని కారు తాళాలు చేత్తో పట్టుకుని బయటకు వస్తున్న సుప్రియారాణి భర్తకేసి చూస్తూ "ఏమిటి అంత సంతోషం" అంది.

'సంతోషమే. ఇల్లంతా అద్దెకిచ్చేసి త్వరలో ప్రయాణానికి రెడికా" అన్నాడు మహాగర్వంగా.

"ఏమిటి?" కారు తాళాలు చేతిలో కదులుతున్నాయి.

"అవును. ఇలా రిటైరయ్యానా, అలా మరోటి. జీతమెంతో తెలుసా" రామారావు గొంతు తగ్గించి భార్యతో జీతం ఎంతో చెప్పాడు భార్య ముఖం ఆనందంతో వెలిగిపోతుందనుకుంటూ.

"పదిహేనో తారీఖుకి వెళ్ళి జాయిన్ కావాలి. మీరేమడిగితే అది ఇస్తాం. అంటున్నారు వాళ్ళు. అవును మరి. ఇంత అనుభవజ్ఞుడైన ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్ దొరకడం వాళ్లదృష్టం. ఏమంటావు?" అన్నాడు భార్య ఎర్రటి పెదాలవైపు చూస్తూ

"అబ్బో..' అంది భర్త జీతాన్ని తలచుకొని మురిసిపోతూ. కానీ వెంటనే ఆలోచన మరోవైపు మళ్ళింది.

"ఇక్కడే ఏమైనా చూసుకోరాదూ. మా బాబాయి క్లినిక్ మీరు తీసుకోండి. అమ్మేయాలనుకుంటున్నాడు" అంది సుప్రియారాణి.

"నో నేను వెళ్ళి తీరాలి. నా వైద్యవృత్తి నా ప్రాణం. తెలుసుగా".

"ఆ తెలుసు" అంది మూతి తిప్పి సుప్రియ.

సుప్రియకి అసలు ఇష్టంలేదు హైదరాబాద్ వదిలి వెళ్లడం. భర్త మనసులో ఆలోచన చెదరగొట్టే ప్రయత్నం మొదలుపెట్టింది.

"ఇంత మంచి ఇల్లు అద్దెకిచ్చేస్తే పాడయిపోతుందండీ" అంది.

"ఫర్వాలేదు" అన్నాడు డాక్టర్ రామారావు. చాలా రకాలుగా చెప్పి చూసాక "నేను మాత్రం రాను. మీ ఇష్టం" అంది సుప్రియ.

"అయినా సుప్రియ...చాలామంది కుటుంబాలు ఇక్కడే వుంటాయి. వారం వారం వస్తూ వుంటారు. నేనూ అంతే" అన్నాడు. రామారావుకి తెలుసు భార్య అక్కడికి రాదని. తను వెళ్లడం మానరాదని.

"అయినా ఎలా వస్తాను చెప్పండి. అమ్మకి ఎవరున్నారు?"

"మీ అమ్మను కూడా మనతోపాటు తీసికెళదాం." "ఈ ఇల్లు అమ్మది. ఇల్లు వదిలి అమ్మ ఎక్కడికీ రాదు" ఖచ్చితంగా అంది సుప్రియ. మొదటినుంచీ అంగీకారమే అది. తను చెల్లీ ఇద్దరే. తల్లి ఆస్తంతా తమకే కనుక తను తల్లిని చూసుకుంటూ ఉండాలి. పైగా ఇక్కండతా స్నేహితులు, చుట్టాలు. అక్కడెవరుంటారు? సుప్రియ అభిప్రాయం మార్చుకోలేదు. డాక్టర్ రామారావు తన మంచి అవకాశం పోగొట్టుకోదల్చుకోలేదు.

ఏడాది దాటింది.వారంవారం రామారావు వచ్చి వెడుతున్నాడు. ఆ వారం ఎందుకో రాలేదు. ఫోను చేసినా కూడా ఊళ్ళో లేరని ఇంటివాళ్ళు చెప్పారు.

సుప్రియ మనసు మనసులోలేదు. ఎక్కడికి వెళ్ళి వుంటారు? అయినా చెప్పకుండా వెడితే ఎలా? ఎంత షోగ్గా వున్నా, ఎంత జుట్టుకు రంగేసుకున్నా మాత్రం అరవై దాటపోయాయి. రెండేళ్ళు కావస్తోంది. ఈ మధ్య దయబెటిస్ కూడాను. ఏమో బాబూ వినరు' సుప్రియ చిరాగ్గా ఆపని ఈ పని చేసుకుంది.

ఫోను మ్రోగింది. ప్రాణం వచ్చినట్టే అయింది. ఈయనే.." అనుకుంటూ ఫోన్ తీసిన సుప్రియకి ఫోన్ కట్ అవడంతో భలే దుఃఖం వచ్చింది.

రేపు తనే వెళ్ళాలి అంతే అనుకుంది. బస్సులో ఓ నాలుగుగంటలు గడిపితే సరి అనుకుంటూ బలవంతంగా కళ్ళు మూసుకుంది సుప్రియ.

రాత్రి పదిన్నర దాటింది. ఫోన్ గణగణ మ్రోగింది.

"హలో! నేను జయని" అవతల గొంతు. జయ, సుప్రియ చెల్లి. మద్రాస్‌లో వుంటుంది.

"బావగారు బాగున్నారా" అంది జయ.

"ఆ..ఆ..మీరంతా ఎలా వున్నారు?" జయ పావుగంట మాట్లాడి ఫోను పెట్టేసింది. సుప్రియ ఆ మాటలన్నీ విన్నాక నీరసంగా, కోపంగా సోఫాలో కూలబడింది. గంటలు గడిచిపోతున్నాయి. కళ్లకి కునుకు లేదు. మనసు మనసులోలేదు. ఇది నిజమా? ఛీ...కాదు, కాకపోతే చెల్లి ఎందుకు ఫోన్ చేస్తుంది?

సుప్రియ ఆ గదిలో అటూ ఇటూ తిరిగింది. భర్తకి ఫోన్ చేసింది. ఎవరూ ఎత్తలేదు. రింగ్ అవుతోంది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. 'నమ్మాలా? వద్దా?' సుప్రియ వితర్కించుకుంటూ అలా మంచంలో వాలిపోయింది.

అసలు ప్రొఫెసర్ రామారావు అక్కడ లేదుట. రాయచూర్ వెళ్ళిపోయారట. అది విమలాబాయ్ ఊరు. విమలాబాయ్ రామారావుతో కలసి చాలా ఏళ్ళు పని చేసిన డాక్టరమ్మ. పెళ్లి చేసుకోకుండా కుటుంబాన్ని పోషిస్తోందని రామారావు చాలాసార్లు చెప్పాడు సుప్రియకి. రామారావు రాయచూర్ వెళ్లాడా? అంటే?

"నువ్వు హైదరాబాద్‌లో కూచుని లలితా సహస్రనామాలనీ, కిట్టీ పార్టీలనీ, నెక్లెస్ రోడ్లని, ఇందిరా పార్కు అని ఇలా కాలక్షేపం చేస్తున్నావు. రాబోతున్న ఆపద గ్రహించడంలేదు' అని చెల్లి జానకి ఒక ఉత్తరంలో వ్రాసింది కూడా.

'మగాడిని నమ్మడానికి వీల్లేదు ఎంత వయసు వచ్చినా' అని అమ్మ అనే మాటలు నిజమేనా? ఏమో? ఇదివరకు ఎవరు ఏం చెప్పినా హైదరాబాద్ వదలబుద్ధి కాలేదు. కానీ..

ఆ మధ్యాహ్నం బస్సులో బయలుదేరింది సుప్రియ. బస్సుల్లో కూచున్న నాలుగు గంటలూ ఇవే ఆలోచనలు. అసలు తమ ముందే చెప్పింది ఊళ్లోనే ఉద్యోగం చూసుకోండి అనీ. అసలు ఎందుకు ఉద్యోగం? హాయిగా తిని కూచోలేక. నిజానికి తనదీ తప్పేమో? తనూ భర్తతోపాటే వుంటే ఈ గొడవలు వుండవు కదా!

సుప్రియ అలా అనుకుంటూ మనసులో కలత పడుతూ వుండగానే బస్సు ఆగింది. గుమ్మంలో అడుగుపెట్టగానే తాళం ఆహ్వానించింది.

ఇంటివాళ్ళు కూడా లేరా? అయ్యగారు లేరా?"

"పెళ్లికని విజయవాడ వెళ్లారండీ. పదిరోజుల దాకా రారు" అన్నాడు నౌకరు.

"పెళ్లికా?"

"అవునండీ. అయ్యగారి చెల్లెలు కొడుకుదండీ." "అబ్బా..నేను డాక్టర్ గారు వున్నారా అని అడుగుతోంది" అంది సుప్రియ.

"ఏమోనండీ. ఆయనెప్పుడెడతాడో, ఎప్పుడొస్తారో నాకేం తెలుసండీ' అంటూనే వెళ్లిపోయాడు నౌకరు.

ఛీ.. రిటైరయ్యాక మొగుడ్ని ఉద్యోగానికి వెళ్ళనీయడం తనదే తప్పు!

కోపంగా వెళ్ళిపోయింది సుప్రియ అక్కడ్నుంచి. ఇంటికొచ్చేసిన సుప్రియ ఆశ్చర్యపోయింది. అత్తా, అల్లుడు కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తున్నారు. సుప్రియ ముఖం ధుమధుమలాడించుకుంటూ గబగబా లోపలికొచ్చి తిన్నగా పడగ్గదిలో వెళ్లింది.

"అక్కడ లేరా? అంది తన పక్కన కూచుని నడుంమీద చెయ్యేసిన భర్త చేయి తోసి పారేసి సుప్రియ.

"ఓక్కడా? ఓ అదా?"

"ఏమిటీ ఎందుకెళ్లారు? పోనీ అక్కడే వుండలేకపోయారా?" అంది బుసకొడుతూ.

"ఉండిపోదామనే అనుకున్నా కానీ.."

సుప్రియ మంచం మీద నుంచి లేచివెళ్లిపోయింది,.

తెల్లారగానే మొదటి బస్సుకి ప్రొఫెసర్ రామారావు వెళ్లిపోయాడు. సుప్రియ మనసు మనసులో లేదు. ఇలాగే మగాళ్ళు స్నేహాలు పెంచేసుకుని బంధాల్లో పడిపోతారేమో? తన స్నేహితురాలి భర్త ఇలాగే తనతో పని చేసే జూనియర్‌ని పెళ్లి చేసుకున్నాడని తెలిసి తను చాలా బాధపడింది.

"నమ్మితే నమ్ము. లేకపోతే మానెయ్. నీ ఇష్టం" ఠక్కున ఫోను పెట్టేసింది జయ.

సుప్రియ ముఖం వెలవెలబోయింది.

ఔట్‌హౌస్‌లో పనిమనిషి కుటుంబాన్ని పెట్టింది. తల్లిని చెల్లి దగ్గరకు పంపింది.

ఆరాత్రి బస్సులో బయలుదేరింది సుప్రియ. పరిస్థితి చేయి జారకుండా జాగ్రత్త పడాలి తను. ఆ విమలాబాయికి భార్య పోయినవాడినే వెతికి పెళ్లి చేసేయాలి. ఆయన నీడలా వెంట వెంటే ఉంటానిక.. ఇలా అనుకుంటూ ఉస్సురనుకుంటూ బస్సు దిగింది సుప్రియ.

భోరున వర్షం కురుస్తుంటే వచ్చిన భార్యని చూసి విస్తుపోయాడు రామారావు.

వేడిగా టీ తాగుతూ–

"అవును భర్త కోసం పధ్నాలుగేళ్ళు నిద్రపోయిన ఊర్మిళమ్మ, భర్త ఎక్కడుంటే అడవియైనా సరే అదే రాజభవనం అనుకున్న సీతమ్మ పుట్టిన నేల ఇది. ఆ పాటి నేను కానా. అంది భర్తకేసి ప్రేమగా చూస్తూ. ,రామారావు ఫక్కున నవ్వాడు.

ఆ తరువాత రెండురోజులకు తెలిసింది ఈ నాటకం ఎవరు ఆడారో! విమలాబాయి పెళ్లి చేసుకుని అమెరికాలో వున్న విషయమూ, రామారావు రాయచూర్ వెళ్ళని విషయం కూడా. "బావగారూ! నాకు పార్టీ ఎప్పుడిస్తారూ?" అని జయ మద్రాస్ నుంచి ఫోన్ చేయడం-

"ఇద్దర్నీ ఒకచోట చేర్చినందుకు, మా కాపురం నిలబెట్టినందుకు నీకు పార్టీ ఏమిటి, పట్టుచీర కొనిపెడతాను" అని మరదలితో ముచ్చట్లాడడం సుప్రియ విన్నాక-

"అబద్ధాలెందుకు?" అంది సుప్రియ నవ్వి. "నిజాలు నమ్మనందుకు, వంటరిగా ఎలా వుండగలను ప్రియా! ఎన్ని రోజులు, ఏళ్ళు నువ్వే చెప్పు" భార్య కళ్లల్లోకి చూసాడు రామారావు.

"రిటైరైన భర్త డబ్బునే కాదు భర్తనీ ప్రేమించాలిగా. అటు చూడు పైనెల దాటితే అరవై రెండేళ్ళు దాటతాయ్." సుప్రియ తాను ఇంతవరకూ చాలా పెద్ద తప్పు చేసినట్లుగా బాధపడింది.

'అయినా ఆ హైదరాబాద్‌లో నీళ్లు రావు. ఒక్కటే బస్సుల రొద. నేను పోను బాబూ! అయినా ఇక్కడెంతో బాగుంది. చక్కగా గార్డెనింగ్ చేసుకోవచ్చు, మనిద్దరం టెన్నిస్ ఆడుకోవచ్చు. అంది ఎంతో సంతోషంగా సుప్రియ.

"అవన్నీ చేసుకోవచ్చు. కానీ నన్ను ఇప్పుడే రిటైరయి ఇంట్లో కూచోమనకూడదు అంతే" అన్నాడు ప్రొఫెసర్ రావు భార్య కళ్లల్లోకి చూస్తూ.

"ఇద్దరిలో ఎవరం కూడా ఎప్పుడూ వంటరిగా వుండకూడదు కదూ" అంది నవ్వి సుప్రియ. "నేనేదంటే నువ్వదే అనాలి. తెలిసిందా" ప్రొఫెసర్ రావు సుప్రియ ఎర్రటి పెదాలవైపు చూసి కొంటెగా నవ్వాడు.

"నేనెక్కడుంటే నువ్వక్కడే!" తలూపింది సుప్రియారాణి.

"ఒంటరితనం వద్దు. జంటగా వుంటే ముద్దు. అవునా?" అన్నాడు.

తలూపింది సుప్రియారాణి.

"షష్టిపూర్తి కథలు" - ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక మార్చి 2001